క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుల్లత తదితరులు

సీటీఆర్ఐ: వార్డు ప్రణాళిక కార్యదర్శుల క్యాలెండర్‌ను డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) విద్యుల్లత ఆవిష్కరించారు. విజయవాడలోని డీటీసీపీ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వార్డు ప్రణాళిక కార్యదర్శులు హాజరయ్యారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం విద్యుల్లత.. వార్డు ప్రణాళిక కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాజమహేంద్రవరం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ డైరీ విడుదల



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా హౌసింగ్ అధికారి పరశురామ్

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 2024 జిల్లా హౌసింగ్ సహాయ ఇంజినీర్ల డైరీని జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సహాయక ఇంజినీర్, జనరల్ సెక్రటరీ బీవీవీ సత్యనారాయణ మూర్తి, సహాయ ఇంజినీర్లు కేఎస్ చక్రవర్తి, ఎస్ఆర్‌వీ శ్రీకాంత్, ఎస్ఆర్ఎస్ శ్రీనివాసు, ఏవీ రామారావు, డీఎస్ చాంబెర్లిన్, ఏ.వెంకట్రావు పాల్గొన్నారు.

కాలినడకన భద్రాద్రికి పాదయాత్ర



మోరంపూడి జంక్షన్‌లో వాసుదేవ గురుస్వామి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ నుంచి కాలినడకన భద్రాద్రికి తరలి వెళుతున్న శ్రీరామ పాదయాత్ర మంగళవారం మధ్యాహ్నం మోరంపూడి జంక్షన్‌కు చేరుకుంది. వాసుదేవ గురుస్వామి (ఉంగరాల వీర వెంకట సుబ్బారావు) ఆధ్వర్యంలో భద్రాచల శ్రీరామ రథోత్సవ పాదయాత్ర సమితి బృందం 400 మంది హనుమ దీక్షాపరులతో ఈ కార్యక్రమం చేపట్టింది. వీరికి శ్రీసాయి భక్తాంజనేయ స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతులు భోజన వసతి ఏర్పాటు చేశారు. వాసుదేవ గురుస్వామి మాట్లాడుతూ ఈనెల నాలుగున కాకినాడలో చేపట్టిన 13వ వార్షిక యాత్రను 10 రోజుల్లో పూర్తి చేసి భారీ అన్నసమారాధన చేస్తామన్నారు. 2012లో ఇద్దరితో ప్రారంభమైన యాత్ర ప్రస్తుతం 400 మందికి చేరిందన్నారు. పాదయాత్ర ఇక్కడ నుంచి కొవ్వూరు, ధర్మవరం, కొయ్యలగూడెం, బయ్యనగూడెం, వేగవరం, పూటపల్లి, కక్కునూరు, వేలేరు మీదుగా ఆంధ్రా నుంచి తెలంగాణ ప్రాంతానికి ఆరు జిల్లాల మీదుగా సాగుతుందన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు వింటి బాబ్జీ, అధ్యక్షుడు పేర్నిడి వెంకటరమణ, వెంకటేశ్వరరావు తదితరులు యాత్రను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

సీతానగరం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. నల్గొండలో అగ్ని ప్రమాద బాధితులు బందిలి చిట్టియ్య, బందిలి అప్పన్నలను మంగళవారం ఆయన పరామర్శించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో వారి తాటాకిళ్లు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులను గణేష్ పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం, మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు, నూతన వస్త్రాలు అందించారు. కాలిపోయిన ఇళ్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని పార్టీ నాయకులను ఆదేశించారు. అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పట్టపగలు విష్ణుప్రసాద్, జక్కంపూడి జగపతి, గంగాధర్, పసలపూడి శ్రీను, టి.మహేష్ పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన పుట్టా కృష్ణ ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త పుట్టా మోహన్, అత్త, మామలు పద్మ, సత్యనారాయణ, ఆడపడుచు, ఆమె భర్త విపుల, శ్రీనివాస్‌పై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం టేకుకు చెందిన మోహన్‌తో ప్రియాంకకు 2016లో వివాహమైంది. రెండేళ్ల కాపురం సజావుగా సాగిన అనంతరం కట్నం కోసం ప్రియాంకను శారీరకంగా, మానసికంగా హింసించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గురుకులం పిలుస్తోంది..

- బొమ్మూరు అంబేడ్కర్ పాఠశాల, కళాశాలలో బాలికలకు అవకాశం
- ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 23 వరకూ గడువు, వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష



బొమ్మూరులో అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: చదువుపై ఆసక్తి ఉన్న వారికి గురుకులాలు సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. ఇక్కడ ఉచిత వసతి సౌకర్యంతో ఉత్తమ విద్యను అందుకోవచ్చు. పేద, మధ్యతరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల్లో 2024–2025 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ) ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ తుది గడువు. వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. నీట్/ఐఐటీల ప్రవేశాలకు సిలబస్‌తో పాటే శిక్షణ ఉంటుంది.

ప్రత్యేకతలు ఇవే..

- విద్యార్థులకు మెరుగైన విద్య, నిత్య పర్యవేక్షణ
- ప్రభుత్వ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం
- అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహం
- నిబంధనలు మేరకు అమ్మ ఒడి పథకం
- జగనన్న విద్యాకానుక (పాఠశాల విద్యార్థులకు)
- నాలుగు జతల యూనిఫామ్, పీటీ డ్రెస్
- కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ
- నిబంధనలకు లోబడి అన్ని ప్రభుత్వ పథకాల వర్తింపు
- వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో శిక్షణ
- అటల్ టింకరింగ్ ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలలో శిక్షణ
- చదువుతో పాటు అన్ని రంగాలలో తీర్చిదిద్దడం
- ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ
- ఎంసెట్, నీట్, ఐఐటీలలో సీటు సాధించేలా ప్రత్యేక శిక్షణ
- యోగా, కరాటేలో శిక్షణ
- ఇంటర్ అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందేలా కమ్యూనికేషన్

గురుకుల పాఠశాల విద్యార్థుల విజయాలు

- జగనన్న ఆణిముత్యాలు పథకంలో జిల్లాస్థాయిలో పారితోషకం అందిపుచ్చుకున్నారు.



కలెక్టర్ మాధవీలత, మంత్రి వేణు చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకుంటున్న గురుకుల విద్యార్థినులు (ఫైల్)

- శ్రేష్ఠ నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచారు.
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నృత్య ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు.
- ఇస్రో క్విజ్‌లో శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు పొందారు.
- కౌశల్ క్విజ్ కాంపిటేషన్‌లో స్టేట్ లెవెల్ బహుమతులు గెలుచుకున్నారు.
- 2021 – 23 బ్యాచ్ ఇంటర్ విద్యార్థినులు హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించారు.

ఐదో తరగతికి అర్హతలివే..

- ఎస్సీ, ఎస్టీ బాలికలు 1.09.2011 నుంచి 31.08.2015 మధ్య, మిగిలిన వారు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి.
- 2022 – 23 విద్యాసంవత్సరంలో 3వ తరగతి, 2023 –24లో నాలుగో తరగతిని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తి చేసి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2023–24నాటికి రూ.లక్ష మించి ఉండరాదు.
- మొత్తం సీట్లు 80, వాటిలో ఎస్సీలకు 60, బీసీ–సీ 10, ఎస్టీలకు 05, బీసీ– 4, ఇతరులకు –1.

ఇంటర్ ప్రవేశానికి అర్హతలు

- 2023–24లో పదోతరగతి పరీక్ష రాసే విద్యార్థులు మాత్రమే అర్హులు.
- 31.08.24 నాటికి 17 ఏళ్ల నిండి ఉండాలి. ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో చదివిన వారికి ఏడాది మినహాయింపు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి.
- ఎంపీసీ 40, బైపీసీలో 40 సీట్లు. ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీ 12శాతం, ఎస్టీలకు ఆరుశాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు.

మార్చి 10న ప్రవేశ పరీక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరే విద్యార్థినులకు మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, జూనియర్ ఇంటర్‌లో చేరే విద్యార్థినులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

https://apgpcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తులో ఐదోతరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు/కళాశాలల మార్పు కుదరదు. ప్రవేశపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు ఉంటుంది. వివరాలను 97017 33321 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉచితంగా నమోదు

అలాగే దరఖాస్తు చేయదలిచిన వారు అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ నకలు, ఐదో తరగతి ప్రవేశం కోసం నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, జూనియర్ ఇంటర్‌కు పదో తరగతి స్టడీ సర్టిఫికెట్, ఉపయోగంలో ఉన్న ఫోన్‌తో బొమ్మూరులోని గురుకుల పాఠశాలకు వస్తే ఉచితంగా దరఖాస్తు చేస్తారు. లేకపోతే మీకు సమీపంలోని నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పేద పిల్లలకు వరం



గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ దాకా చదువు, వసతి, అవసరమైన సదుపాయాలు ఉచితంగా ఉంటాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఉంటుంది. ఉన్నతమైన కోర్సులో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఇది పేద పిల్లలకు వరమని చెప్పవచ్చు.
– ఏ.వాణికుమారి, ప్రిన్సిపాల్, గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, బొమ్మూరు

నగర అభివృద్ధికి నిరంతర కృషి

- సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత ప్రగతి
- ఎంపీ, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ భరత్‌రామ్



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధికి ఈ ఐదేళ్లలో నిరంతరం పని చేశానని, తన కృషిని గుర్తించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ కోరారు. స్థానిక ఒకటో డివిజన్ లాలాచెరువులోని బత్తిన నగర్‌లో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. పార్టీ శ్రేణులు, వార్డు పెద్దలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సమస్యలేమైనా ఉన్నాయా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పోటీ చేస్తున్నామని, మీ అందరి ఆశీస్సులు, మద్దతు కావాలని కోరారు. బత్తిన నగర్‌లో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టేకుమూడి అర్జునరావు, టేకుమూడి సూరిబాబుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్, నెక్కెళ్ల బాబూరావు పాల్గొన్నారు.

ఈనెలలోనే ఇళ్ల పట్టాలిస్తాం

ప్రతిపక్ష టీడీపీ సృష్టించిన అడ్డంకులను అధిగమించి, వారి కుట్రలను భగ్నం చేసి నిరుపేదల సొంతింటి కల సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తున్నట్టు భరత్‌రామ్ తెలిపారు. అర్హత కలిగిన మహిళలకు ఈనెలలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వనునట్టు ప్రకటించారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల విడుదల సందర్భంగా నగరంలోని 43, 44, 1, 50 వార్డులకు సంబంధించి మల్లికార్జున నగర్ రామాలయం వద్ద, లాలా చెరువు మున్సిపల్ హైస్కూల్ వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గత ఎన్నికలలో మీరు చేసిన పెద్ద తప్పు ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేను గెలిపించడమేనన్నారు. మీకు ఇళ్ల స్థలాలు రాకుండా అడ్డుకున్నదీ వారే అన్నారు. రకరకాల కారణాలతో కోర్టులో కేసులు వేసి స్టే తేవడం వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. వాటన్నిటినీ అధిగమించామని త్వరలోనే ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. నగరంలో 40 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు కాగా, 16 వేలమందికి వెలుగుబందలో స్థలాలిచ్చామని, మిగిలిన 24 వేల మందికి ఈ నెలలో అందజేస్తామన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికలలో మహిళలకు, రైతులకు రుణ మాఫీ చేస్తానని మాటిచ్చి నిలువునా మోసం చేశారన్నారు. యువతకు ఉద్యోగాలిస్తానని చెప్పి దగా చేశారన్నారు. జగనన్నను మరోసారి సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది అన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్, నాయకులు పాలిక శ్రీను, ముప్పన ప్రభాకర్, బూరాడ మాధురి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 531 మందికి వైద్యసేవలు



కోలమూరులో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ జగదీష్



కడియపుసావరంలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామ సచివాలయం – 2 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 531 మందికి వైద్యసేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. శిబిరాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. కాతేరు పీహెచ్‌సీ వైద్యులు జగదీష్, ఈ.నాగేదేవి, ఆర్థోపెడీషియన్ వరప్రసాద్, జనరల్ ఫిజీషియన్ వి.వినయ్, ఆప్తాల్మిజిస్ట్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడియపుసావరంలో..

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరాలు పేదలకు వరంగా మారాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్ కుమారి అన్నారు. కడియపుసావరం–1లో మంగళవారం డాక్టర్ ఎస్.నాగసాయి మౌర్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి సందర్శించి వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరంలో 464 మందికి వైద్యసేవలు అందించారు. 61 మందికి కంటిపరీక్షలు జరిపారు. ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.నాగసాయి మౌర్య, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎ.వాసవీలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.మోహనవంశీ, ఆప్తమాలజిస్ట్ జి.సునీత సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సాపిరెడ్డి వీర దుర్గాకామేష్, పంచాయతీ కార్యదర్శి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తత అవసరం

- కమిషనర్ దినేష్ కుమార్
- అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల నిర్వహణలో సిబ్బంది నిబద్ధత, అప్రమత్తతతో వ్యవహరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ సూచించారు. స్థానిక వేంకటేశ్వర కళాకేంద్రంలో మంగళవారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల నియమావళిపై దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ఎన్నికల సంఘం కల్పించిన హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు, కోవిడ్ బాధితులకు ఇంటి దగ్గరే ఓటు వేసే హోమ్ సౌకర్యం కల్పించబడిందన్నారు. ఇప్పటికే బూత్ లెవెల్ అధికారుల వద్ద 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల వివరాలను సేకరించామని, వారికి 12డి నమూనాలో దరఖాస్తు చేయించడం జరుగుతుందన్నారు. వీరికోసం సంచార ఓటింగు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సౌకర్యం కావాల్సిన వారు తగిన ఆధారాలు చూపించాలన్నారు.

రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సుమారు 6,600 మందిని హోమ్ ఓటింగ్‌కు గుర్తించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో నిర్దేశించిన విధంగా సౌకర్యాలు ఉన్నాయా లేదో పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సంబంధిత అధికారుల సంతకంతో జాబితాను రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

11న వేమగిరిలో దళిత సింహగర్జన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీరాజ్, కిరణ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నేతృత్వంలో వేమగిరిలో ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్న దళిత సింహగర్జనను విజయవంతం చేయాలని జీవీ శ్రీరాజ్ పిలుపునిచ్చారు. బొమ్మూరులో దళిత నాయకుడు వరిగేటి కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత గర్జనకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులందరూ తరలి రావాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కొమ్ము ప్రభాకరరావు, తెనాలి కిరణ్, ఇందుగుమిల్లి చిరంజీవి, పసలపూడి, పాపారావు, పారోజు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి కుటుంబం చేసిన మేలు శూన్యం

- పుష్కరాల నిధులు ఏమయ్యాయో చెప్పగలరా!
- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ఆదిరెడ్డి కుటుంబం 16 ఏళ్లుగా అధికారం చెలాయిస్తున్నప్పటికీ నగరానికి చేసిన మేలు ఏమీ లేదని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్కెళ్ల బాబూరావు, నగర కార్యదర్శి పెంకే సురేష్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు తల్లి మేయర్‌గా, తండ్రి ఎమ్మెల్సీగా పనిచేశారని, భార్య ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారన్నారు. అయినా నగరానికి, ప్రజా సంక్షేమానికి ఏమి చేశారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎంపీ భరత్‌రామ్ నగరాన్ని నగర పాలక సంస్థ అధికారుల పర్యవేక్షణలో అద్భుతంగా తీర్చిదిద్దుతుంటే, అభివృద్ధి ముసుగులో అవినీతి చేస్తున్నారని ఆరోపణలు చేయడం వాసు అజ్ఞానానికి నిదర్శనమన్నారు. అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్టు అనుమానం వస్తే నేరుగా నగర పాలక సంస్థ అధికారులను అడగాలన్నారు. ప్రతి విషయంలో ఎంపీ భరత్‌రామ్‌పై బురద జల్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలందరూ భరత్ చేసిన నగరాభివృద్ధిని చూసి మెచ్చుకుంటున్నారన్నారు. ఆదిరెడ్డి కుటుంబ సభ్యుల హయాంలో ఎక్కడ, ఎంత అవినీతి జరిగిందో ఆధారాలు, రికార్డులతో సహా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 2015 పుష్కరాలకు మంజూరైన స్పెషల్ గ్రాంట్ రూ.2 వేల కోట్లతో ఏమి అభివృద్ధి చేశారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎండీ ఖాన్ బాబు, ఎండీ గౌస్, ముత్యాల వీర అప్పారావు, కొమ్మోజు దుర్గారావు, రేగుళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో నడపనున్న వన్ స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్టు / ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేయడానికి స్థానికంగా ఉండే అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారిత అధికారి కె.విజయకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్ –1, కేసు వర్కర్ – 2, పారా మెడికల్ పర్సనల్ – 1, సైకో – సోషల్ కౌన్సెలర్ – 1, కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన ఆఫీస్ అసిస్టెంట్ – 1 (పూర్తి స్థాయిలో పరిజ్ఞానం ఉండాలి), మల్టీ పర్పస్ స్టాఫ్ /కుక్ – 3, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ – 3 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల స్థానిక మహిళా అభ్యర్థులు బుధవారం నుంచి దరఖాస్తులను Eastgodavari.ap.gov.in డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన అనంతరం అన్ని ధ్రువపత్రాల నకళ్లను గజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించాలన్నారు. వాటిని బొమ్మూరులోని జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు.

డాక్టర్ మోహన వంశీకి సత్కారం

కడియం: స్థానిక సీహెచ్‌సీలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.మోహన వంశీని మంగళవారం వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆమె ఉత్తమ వైద్యురాలుగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను సత్కరించి, అభినందనలు తెలిపారు.

8, 9 తేదీల్లో షర్మిల బస్సుయాత్ర

రాజమహేంద్రవరం సిటీ: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 8, 9 తేదీల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో చేపడుతున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ కోరారు. నగరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ యాత్రలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికడతాం : డీఎస్పీ శ్రీనివాసులు



మధురపూడి: ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా నార్త్ జోన్ డీఎస్పీ కండే శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన ఇటీవల సౌత్‌జోన్ నుంచి నార్త్ జోన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అలాగే ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఎరువుల తనిఖీ

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను మంగళవారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీకే మల్లికార్జునరావు తనిఖీ చేశారు. కోరుకొండ మండలాధికారి గౌరీదేవి, హబ్ ఏవో రామతులసి పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



స్కాలర్ షిప్‌లు అందజేస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఈ పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ సూచించారు. స్థానిక హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో మంగళవారం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ప్రతిభ గల పేద విద్యార్థినులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులను గుర్తించి, సీఎస్ఆర్ నిధుల నుంచి స్కాలర్ షిప్‌లు అందిస్తున్న మలబార్ గోల్డ్ నిర్వాహకులను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యా దీవెన, వసతి దీవెన వంటి వాటితో విద్యార్థులకు చేయూతనందిస్తోందన్నారు. మలబార్ గోల్డ్ రాజమహేంద్రవరం స్టోర్ హెడ్ హిషం మహ్మద్ అలీ మాట్లాడుతూ జిల్లాలో 316 మంది పేద విద్యార్థులను గుర్తించి, ఒక్కొక్కరికి రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున రూ.27.64 లక్షల స్కాలర్ షిప్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.